హృదయ జ్వాలలు

శ్రీ జనస్వామి కోదండరామశాస్త్రి

వీరాస్వామి ఉద్యోగంనుంచి విముదల కాగానే తన జీవిత శేషమును ప్రశాంత వాతావరణమున గడుప దలచి అమితోత్సాహంగా స్వగ్రామం చేరుకున్నాడు. కాని వచ్చిన వారం రోజులకే అతనిలో ఒక విధమైన అసంతృప్తి, ఆవేదన ప్రారంభించినయ్. రోజులు గడిచిన కొలదీ అతనిలో విసగట, చీకాకు మితిమీరుతున్నాయి. ఆ గ్రామమును వీరాస్వామి ముప్పదేండ్ల క్రితం విడిచివెళ్లాడు. అప్పటినుండి ఎన్నడైనావచ్చినా ఒకగంటకాలంకంటె ఆ వూళ్ళో వుండుటకు తీరిక లభించేది కాదు. అందువలన ఆ గ్రామంలో ఇప్పటి వార్ని గురించి అతనికి తెలియదు. స్వగృహంతప్ప ఆ గ్రామంలోని తతిమా అంతా అతనికి క్రొత్తగావున్నది. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరపు నాగరికతా ప్రభావం ఆ గ్రామంపైనకూడా అఖండంగా పని చేసింది. తాను బాగా వయసులో వున్నపుడు నిర్జన ప్రదేశములుగావుండి నక్కల నివాసస్థానములుగా పేరుపడ్డ కొన్ని భాగాలు నేడు గ్రామపు నడిబొడ్డు వీథులుగా తయారై ఉన్నతసౌధాలతో నిండివున్నాయ్. అపరిమితమైన ప్రతిభతో, చాకచక్యంగా గ్రామ పెత్తందారీతనమును సాగించిన ఆ నాటి గ్రామపెత్తందార్లను తలిచే వారులేరు. అవి ఎన్నడో కాల గర్భంలో లీనమై పోయినయ్. అపుడు బీడుగా పడి వున్న ఆ గ్రామం చుట్టూగల భూమి యీ నాడు దివ్యమైన ఉత్పత్తి శక్తులనుపుంజింపజేసుకుని ప్రశస్తమైన దొర పుగాకును పండిస్తూ అప్పట్లో కూటికి గతి లేక పకీర్లుగా ఎంచబడిన కొందరికి లక్షలు గడించిపెట్టి సంఘంలో అగ్రస్థానాలను అనంతభోగాలను అందిస్తున్నవి.

వీరాస్వామిని పలకరించే వారు కాని తలిచే వారు కాని కన్పించలేదు ఒక్క వెంకోజీ తప్ప. వెంకోజీ వీరాస్వామికి పూర్వ పరిచయస్థుడు. దేహం ముడతలు పడిపోతున్నా కాయబారు శరీరం కావడం చేత వెంకోజీకి నడక పెద్ద పరిశ్రమగా తోచదు. రోజుకొక తడవైనా వీరాస్వామివద్దకు పనివేళ్లా వచ్చి పిచ్చాపాటీ మాట్లాడి పోతూంటాడు. వీరాస్వామికి కాలం చాలా కష్టంగా గడుస్తున్నది. అతను ఉద్యోగంలో వున్నపుడు గబగబా పరువులెత్తి పూర్తి కావలసిన కార్యములలో సగంపాలు మిగులుచూపి ఊపిరాడకుండా చేసిన కాలచక్రం యిపుడు అనంతమైన విశ్రాంతిని చూపి మనసుని వెక్కిరిస్తోంది. ఆ రోజు కారోజు గడిచినకొద్దీ ఒంటరితనం చాలా బాధాపూరితమై అతనిలోని ప్రతిఅణువునూ నీరసపరుస్తోంది. వచ్చే పోయే మనుష్యుల గుంపుల్తో ఎపుడూ సందడిగా వుండే తాలూకా ఆఫీసులో బిళ్ళ బంట్రోతు వుద్యోగం అతనిది. కాకీదుస్తులు ధరించి మెళ్లో బిళ్ళ పట్టా వేసుకుని నీటుగా అధికారంగా, అధికారి ప్రతినిధి నన్నట్లుగా ప్రభుత్వ దర్జాతో తాసీల్దారుగారి ఆఫీసుగది ముఖద్వారంవద్ద నిలబడి లోనికి వెళ్ళేవారిని చూపుల్తో అదిలిస్తూ, అవసరమైనపుడు వినయవిధేయతలు కురిపిస్తూ సాయంకాలం అయిదుగంటలగుసరికి కనీసం నాలుగు రూపాయలైనా కళ్లచూచే అలవాటుగల వెనుకటి జీవితంతో, రాగికానీకూడా సంపాదించుకొన నోచుకోనియిప్పటి తన పరిస్థితిని పోల్చి చూసుకుంటే ఎక్కడా సాపత్యం కుదరటంలేదు. ఇది ఒక పునర్జన్మగా తోస్తున్నది.

వీరాస్వామిది చాలా కష్టజీవితమని అతనిభార్య జీవించివున్నపుడు జాలిపడుతూండేది. పదహారేండ్ల వయసువరకు సోమరిపోతుగా బజార్లవెంట తిరిగిన వీరాస్వామికి తండ్రి మరణం ఒక గొప్ప నీతిపాఠం నేర్పింది. నాలుగు నెలల్లో స్వయంకృషితో చదవడము, వ్రాయడము నేర్చుకుని బుద్ధినైపుణ్యంచేత ఒక డిప్యూటీ కలెక్టరుగారి అనుగ్రహమునుపొంది జవాను వుద్యోగాన్ని సంపాదించాడు. తనకంటే పై అంతస్థులలోనున్న వారిని వినయవిధేయతల్తో సేవించి తద్వారా మంచివాడనిపించుకుని ఆ మంచితనాన్ని ధనార్జనకు ఉపయోగపడేలాగు

చూసుకోవటమే అతని జీవితాశయమైపోయింది. మానవుల అంతస్థుల విభజనలను, వర్గభేదములను కనీసం మనసులోనైనా అతడెన్నడూ తిరస్కరించి ఎరుగడు. ఎంతటి అవమానకరమైన విషయాన్నిగురించైనా ఆవేశంగా ఆలోచించుట అతనికి చేతగానిపని. మనశ్శాంతిని అంత తేలిగ్గా పోగొట్టుకునే ప్రకృతి కాదు. ఒక్కొక్క తె[illegible] అనవసరంగా అహంకారం తెచ్చుకుని ధామధూములు చేసి దూషించినపుడు అతని నుండి పొందగల్గిన జవాబు శాంతరసం చిందులాడే మందస్మితంమాత్రమే. అతనిలోని ఆ నిశ్చలశక్తే అధికారుల్ని ఆకర్షించేంది. లంచం డబ్బులు యిస్తేగాని ఆఫీసుగదిలోకి రానివ్వటం లేదని ఎంతో మంది ఫిర్యాదులు చేసినపుడు కూడా అధికారులు 'వాడి కడుపు తిప్పలు వాడిది' అన్నట్లుగా చిన్నగా నవ్వి వూరుకునే వాళ్ళు. ధనార్జనకు మానవ పౌరుషమును బలిపెట్టవల్సిందేనని అతని భావన.

వీరాస్వామి ఉద్యోగవిరమణ చేసిన నాటికి అతను ఆర్జించి నిలవచేసుకున్న ధనంగూర్చి లెక్క చూసుకుంటే బ్యాంకుల్లో వున్నది కాని, ప్రావిడెంటుఫండు బాపతుగాని, దగ్గిరవున్న రొఖ్ఖంగాని పదివేలకు ఏమాత్రం తగ్గదు. ఇదిగాక జీవితాంతమువరకూ నెల నెలకు పింఛనుబాపతు రాబడివుంటుంది. ఒకనాడు తమ ఇష్టాగోష్టిలో బయటపెట్టాడు వీరాస్వామి యీ మాట వెంకోజీతో. వెంకోజీ వెంటనే ఆశ్చర్యచకితుడై గుండెలు కొట్టుకుంటూ అన్నాడు. "అట్లాగా వీరయ్యా నాతో యీ సంగతి ఎన్నడూ చెప్పావుకావే? నువ్వు తెలివికలవాడివనీ నేర్పరివనీ అనుకోటంలో నేను చాలా పొరబాటుపడుతున్నానని ఇప్పుడు విచారిస్తున్నాను."

వీరాస్వామి చిన్నగానవ్వి యిలా అన్నాడు "ఎందువల్ల వెంకోజీ? నా తెలివితక్కువ తనమును గూర్చి కొత్తగా ఏమి తెల్సుకున్నావ్?"

"పదివేలు దుడ్డుకలిగివుండి, నెలనెలకు పింఛను బాపతు రాబడివుండీ... ఆఁ... ఇవన్నీ వుండీకూడా... ఇంత స్థిమితము సౌకర్యములు కలిగి కూడా మళ్లీ తిరిగి గృహస్థువు గాకుండా వున్నావంటే తెలివితక్కువ తనంగాక మరేమనాలి? కొంచెం చదువు సంధ్యా నేర్చుకొని లోకజ్ఞానం సంపాదించిన మనలాంటివాళ్ళే బుద్ధిహీనంగా ప్రవర్తించి సౌఖ్యాల్ని చంపుకుంటూ కూర్చుంటే, ఇక మన కులాల్లోని అజ్ఞాన ప్రజను అని మాత్రం ఏమి ప్రయోజనం?" వెంకోజీనుండి వెలువడిన పై మాటలు సద్భావంతోనే కూడినవనీ, ఎగతాళి మాటలు కావనీ వీరాస్వామి వూహించాడు.

"అదేమిటి వెంకోజీ? నా భార్య మూడు సంవత్సరాల క్రితమే కదా గతించింది!"

"అయితేమాత్రం నిన్ను మళ్లా ఒక ఇంటివాడ్ని కావద్దనీ, తననే తల్చుకుని కుముల్తూ చావమని చెప్పలేదుకదా?"

"చెప్పలేదనుకో. వివాహమునకు మాత్రం మానవ జీవితంలో తగినవయసు లేదా వెంకోజీ?"

"తగిన వయసేమిటోయ్? వయసు ముదిరిందని ఆహార విహారాల్లో అశ్రద్ధ చూపటం, అడవుల్లోకి పారిపోతా ననటం ఎంత అవివేకమనిపించుకుంటుందో యిదికూడా అంతే."

వెంకోజీది గట్టిబుఱ్ఱ. తన అభిప్రాయాల వేపుకు ఇతరులను త్రిప్పుకోటంలో అతను గొప్ప దిట్టరి. అతని భావనలు ఎపుడూ శుభంతోనే కూడుకుని వుంటయ్. కావల్సినవారికి అతను ఇళ్ళుకట్టిపెడుతూంటాడు. అలాగే అవసరంలేని వారినికూడా గృహనిర్మాణమునకై ప్రోత్సాహపరుస్తూంటాడు. ప్రతిమానవునకు గృహము, గృహిణి అత్యవసరములని అతని నమ్మిక. ఈ రెండూ కారణ కార్యములవంటివి గనుక ఒకదానియందు శ్రద్ధవహించి మరియొకదానిని నిర్లక్ష్యపరుపకూడదని అతనివాదన. అతను నలభై సంవత్సరాల అనుభవం గల తాపీమేస్త్రి.

వీరాస్వామి కొంచేంసేపు ఆలోచించి ఇలా అన్నాడు. "ఏ విషయంలోనైనా సరే వయసునుబట్టి పోకపోతే వెఱ్ఱివాళ్ళం కావటము నేది నిశ్చయం."

"వయసు ముదిరిందికదా అని జీవితాన్ని నాశనం చేసుకోమని ఎక్కడున్నదోయ్? ధనలోపం గనక; వయసు ముదిరింది. కాయకష్టం చేసుకుని భార్యను పోషించుకునే స్థితిలోకూడా లేవని వూరుకోడానికి? సంతానమైనావుంటే అనుకోవచ్చు. పితృఋణం తీర్చుకోలేని అధముడవవుతావా? వాళ్ల పుణ్యవిశేషాలవలన స్వర్గసీమ నలంకరించిన నీ పితృదేవతలు ఒక్క మాటుగా తటాలున పాపకూపంలోకి రాలిపడరూ? బిడ్డా పాపా లేని బ్రతుకు ఏమి బ్రతుకయ్యా? నిన్ను భగవంతుడు మాత్రం ఎట్లా మెచ్చుతాడు? పున్నామ నరకమును

భవించటం సామాన్యమైనపని అనుకున్నావా? అయినా ఏమాత్రం వయసు ముదిరిందేమిటి? నాకంటే పదిహేనేళ్లు చిన్నవాడివికదా!"

"నాకు మొన్న నాలుగో తారీఖుకి యాభై ఆరు నిండినై తెలుసా?"

"అబ్బో చాలా పెద్దవయసే! పిచ్చివాడ, ఆ వయసు మానవుడికి ఒక పెద్దవయసుటోయ్? పాలడబ్బాల్లోనూ కల్తీ ఆముదంతోను పెరిగే ఇప్పటి కాలపువాళ్లమా ఏమిటి? నలభైయేళ్లకే ఒళ్లు జవజవలాడిపోడానికి! నువ్వు చెప్పిన వయసు నాకుదాటిన తర్వాతే మా చివరి వాళ్లిద్దరూ పుట్టింది! ఇదిగో వీరయ్యా ఒక లేమాటవిను. మానవుడై పుట్టినాక ఒక బాల్యంలో తప్ప మరే దశలోనైనాసరే గృహము, గృహిణి వుండి తీరవల్సిందే! అలా లేనివాడి బ్రతుకు బ్రతుకే కాదు. గద్బకంప."

ఈ చివరిమాటలు వీరాస్వామి మనసుకు సూటిగా తగిలినయ్. వీరాస్వామి వెంకోజీకి మరొక విషయంపై దృష్టి మరలునట్లు ప్రసంగం ప్రారంభించాడు. వెంకోజి యీ విశాల విశ్వంలోని ప్రతివిషయమునుగూర్చి తనకు గల అతి పరిమితమగు జ్ఞానమునే వుపయోగించి గుక్క త్రిప్పకోకుండా గంటలకొలదీ అమోఘంగా మాట్లాడగలడు. ఫలాని విషయం కావాలనే పట్టుదల ఏమీ వుండదు. తనకు అనంతమగు లోకజ్ఞానం కలదనీ, గొప్ప అనుభవజ్ఞుడనీ ఇతరులు తెలదగలందులకు ఏదో ఒకవిషయముంటే చాలును. కాంగ్రెస్ మంత్రుల హయాములో ప్రభుత్వపు వివిధ శాఖలకు సంబంధించిన భవన నిర్మాణ సందర్భములలో వాస్తుశాస్త్రము పట్ల అశ్రద్ధ చూపుటచేత, వైవాహిక సాంప్రదాయములపై సారంపారం లేని ఆంక్షలు విధించుటవల్లా ఆంధ్రదేశంలో యీ మధ్య కాంగ్రెస్ పతనం సంభవించిందని పదేపదే చెప్తూంటాడు. తన అమూల్య విశ్వాసములకు విలువయిచ్చే వాళ్లెవరూ కన్పించలేదనే నిరుత్సాహమంటూ ఏమీ వుండదు. కనీసం గంటసేపైనా దినపత్రిక చూడటం, దేవాలయంలో పురాణ శ్రవణం చేసివచ్చి ఆ విన్నదానిని గోరంతలు కొండంతలుగా చేసి అద్భుత వర్ణనల్తో కూర్చి తన విమర్శనల్తో సహా వినేవారికి తలనొప్పి వచ్చేటంతవరకూ వాగటం—ఇవి ఇతని ముఖ్య దినిక విధులు.

వీరాస్వామి లోపలికి వెళ్లి పక్కమీదవాలి వెంకోజీ పలుకులను గూర్చి దీర్ఘంగా ఆలోచింప ప్రారంభించాడు. ఆలోచించిన కొలదీ మనసు విభిన్న భావాల తాకిడితో బరువెక్కిపోతోంది. 'గృహము గృహిణి లేనివాని బ్రతుకు బ్రతుకే కాదు. గద్బకంప' అని అతని శ్రవణపుటముల్లో వెంకోజీ గంభీర కంఠనాదము కొట్టవచ్చినట్లు ధ్వనిస్తోంది. తాను మూడు సంవత్సరాలనుంచీ శాంతి సౌఖ్యాలకు దివ్యనిలయమని దేనిని గురించి తలచుతున్నాడో, ఆ జీవితకాలమునకు గాలిలో పైకెగసిపోవు కాగితపు ముక్క కున్నంత విలువ కూడా లేదని అతని ఊహాపథంలో వెంకోజి నిలబడి నొక్కి వక్కాణించి పలుకుతున్నాడు. తాను జీవితంలో యింతవరకూ రెండే సుఖాలను చవిచూడగలిగాడు. మొదటిది అధికారులసేవ, రెండవది అవకాశం వున్నంతవరకూ జేబులు నింపుకోవటం. ఇకపోతే దాంపత్య జీవితం ఆటూపోటూ లేని మందనదీ ప్రవాహంవలె నడిచిపోయింది. తన భార్య ఆదెమ్మ పెద్దగా సుఖడోలికల్లో వూగించిందీ లేదూ. దుఃఖాలలో ముంచి లేవనెత్తి అసంతృప్తుణ్ని చేసిందీ లేదు. ఏదో సామాన్య గృహిణిగా సనాతనాభిప్రాయముల్తో జీవించి వూపిరి విడిచే నిమిషంవరకు సంతానప్రాప్తిలేని దుఃఖంతో కుమిలిపోతూనే వుంది. ఆమె చిరకాల వాంఛితాన్ని నెఱవేర్చుట తన విధి కాదా? ఆమె జీవితాశలను ఫలింపజేసి ఆ అమాయికపు ఇల్లాలికి ఆత్మశాంతి చేకూర్చుట తన విధి కాదా? ఇప్పటికీ తనకు పదిమైళ్ళ దూరంగా తారట్లాడుతూండిన జరత్వమును గూర్చి డిపార్టుమెంటువారు వులికిపడి సర్వీసుకు పనికి రావని వెళ్లగొట్టేశారు గాని అసలు తనలో ముసలితనం ఎక్కడున్నది? పదిసంవత్సరాల క్రితముకంటె యీ రోజున తన దేహదారుఢ్యం ఒక వలుసైనా తగ్గలేదే మానసిక పటిష్ఠత కూడా శారీరక బలమునే అనుసరించి వున్నదికదా! ఒక్కొక్కపుడు తన ఆత్మ విశ్వాసములకే ఎదురు తిరిగి తన మనసు ఎంత మారాము చేస్తూ వుంటుందో తనకు పింఛను యిచ్చి బంపిన ఆ జిల్లా అధికారులకు ఏమి తెలుసు! వీరాస్వామి మనసు కొంచెంగా మెత్తపడ్డది. వెంకోజీ అతని హృదయంలో విజయపతాక ప్రతిష్ఠాపనకై ఇపుడిపుడే స్థాపన సామాగ్రి కూర్చుకుంటున్నాడు. వెంటనే కొద్దికాలం క్రితం జరిగిన ఒక ఉదంతం అతని చిత్తవీధిలో వూగింది ఆ వయ్యారి మంత్రసాని తనవేపు ప్రణయ

దృక్కులు విసరినపుడు శరీరం పులకరించి ఏ మధుర స్పర్శకో ఆరాటపడ్డది. తాను తెలివిగలవాడు గనుక పరిస్థితులు శృతిమించి రాగాన పడకుండా ప్రవర్తింప గలిగాడు. ఆ క్షణానే తనకింకా కొంతకాలంపాటు స్త్రీ సాంగత్యపు అవసరం కలదని గుర్తించాడు. కిటికీ చువ్వల సందులోంచి మలయపవనములు బలవంతంగా దూరుకొనివచ్చి అతని వీపును చల్లగా, నెమ్మదిగా తాకుతున్నయ్. గోడప్రక్క నేవున్న సంపెంగిచెట్టు పుష్పపరిమళమును లోపలకు జోరుగా పంపుతోంది. వీరాస్వామి కొంచెం విసుగ్గా లేచి కూర్చొని శాలువా కప్పుకుని తలనొక్కకుంటూ లేచి కిటికీవద్దకు వచ్చి నిలబడి చువ్వలసందుల్లోనుంచి దృష్టి బయటకు సారిస్తున్నాడు. ధవళచంద్రికలు తుషార బాష్పములను వర్షిస్తున్నయ్. దూరంగా కన్పిస్తూన్న ఇసుకతిన్నెల కాంతుల్లో సువర్ణప్రతిమల వలె మెరుస్తున్నాయి. ఆ ప్రక్కనేవున్న నదీప్రవాహపు చీలిక ఏదో ఆశయమును, పరమావధిని దృష్టిలోవుంచుకొని చురుకుగా ముందుకు సాగిపోతోంది. ఎక్కడినుంచో ఝూంకార ధ్వనితో గభాలునవచ్చి ఒక భ్రమరం మందార కుసుమంపై వాలి మధుభక్షణ ప్రారంభించింది. ఎదురుగా కన్పిస్తూన్న జామచెట్టు శాఖోపశాఖల్లో ఫలపత్ర కుసుమాదులతో నిండి చల్లగాలికి నెమ్మదిగా తల వూపుతూ అతన్ని చూచి వెక్కిరిస్తున్నట్లుగా వుంది. వీరాస్వామి మనసులో పదిమంది వెంకోజీలు ఏకకంఠ స్వరంతో నిగ్గదీసి అడుగుతున్నారు. 'ఆ శోభ నీకు ఏదయ్యా? నీ జీవితవృక్షం ఎండిమోడైపోయింది' మరల వెంకోజీ కంఠం సానునయ ప్రబోధం ప్రారంభించింది. 'పిచ్చివాడా? వివాహంచేసుకుని నీ జీవిత వృక్షమును చిగిరింపచేసుకో. సృష్టిలో వికాసంలేని దేనికీ సౌఖ్యంలేదు. ముకుళిత పుష్పంవలన ప్రపంచమునకు కలిగే ప్రయోజనం ఏమిటి? ఏకాంతంవలన నీకు లభించేదల్లా మనసు సంకుచితమైపోవటమే. అమృతప్రాయమైన ఆడదాని అనురాగమునకు దూరముగా వుండి మనసును అనవసరంగా మండింపజేసుకుని నీకు నీవై మృత్యుదేవతయొక్క కఠినాలింగములోనికి జరిగిపోకు. నీలాల నింగిలోనిండు జాబిల్లి ఏ కుసుమ కోమలియొక్క రాగసుధను పొందవలెననో ఎంత వేగంగా పరుగిడుతున్నాడో చూడు.' వీరాస్వామి అస్థిమితచిత్తంతో గిరుక్కున వెనక్కు తిరిగివచ్చి పక్కపై వాలి నిద్రాదేవికి స్వాగత వాక్యాలు పలికాడు. వెంకోజీ ప్రబోధములు అతని జీవశక్తిలో కలుగజేసిన గంభీరమైన కదలికను ఆ వెన్నెలరాత్రి ఒక కల్లోల ప్రవంతిగా పరిణమింపచేసింది.

మర్నాటి సాయంకాల సమయాన పురాణశ్రవణానంతరం వెంకోజీ వీధిగుమ్మంలోనుంచే 'అరి విడితప్పదియ్యా భీష్మాచార్యులు ధర్మరాజుకు ఏం ధర్మబోధ చేస్తాడయ్యా? మనవాళ్ళకు చెపితే నచ్చదుగాని మాంసభక్షణ ఎంత పాపభూయిష్టమని చెప్తాడనుకున్నావ్! అసలు ఆబాపతు ఆహారపదార్థాలు వాడటం మానేసే నలభైయేళ్ళయింది వీరయ్యా.' అని స్వస్తి చెప్పుకుంటూ లోపలకొచ్చి వసారాలో కూర్చున్నాడు. ఇతగులనుంచి జవాబులేదనే నిరుత్సాహం వెంకోజీకి లేనేలేదు. వీరాస్వామి ఏదో ఆలోచనల్లో మునిగి మౌనంగా కూర్చున్నప్పటికీ వెంకోజీ మరల తన అమూల్యాభిప్రాయములను వెలువర్చ నారంభించాడు. 'కాని వీరయ్యా భీష్మడంటే నాకు ఒకందుకు మహాకోపమయ్యా, పోనీ తన వలపుల భరిణను తండ్రికర్పించి గొప్ప త్యాగమే సలిపాడనుకో. తాను కూడా ఏ పేదింటిపిల్లనో చూసుకుని పెళ్ళాడివుండకూడదూ? ఏమున్నదయ్యా? గృహము, గృహిణి లేని జీవితం బీటలువారిన నల్లరేగడి నేల కాదయ్యా?...' వెంకోజీ అనర్గళోపన్యాసమునకు అడ్డుతగిలి వీరాస్వామి అన్నాడు "అంతే నంటావా మామా?"

అవును అంతేగాక! నీ మాటైనా అంతే"

"అయితే చేసుకుందామని వుద్దేశం కలిగినా నాకీ యీడులో పిల్లనెవరిస్తారు మామా?"

"ఎవరిస్తారా? నీవు ఒప్పుకోవాలేగాని బోలెడు మంది సిద్ధంగా వున్నారు."

"నిజంగానా మామా? నాకు వివాహంచేసికోవాలనే అని పిస్తోంది."

"అయితే కనుక్కుంటాను వుండు. చెరువు కట్ట మీద ఎల్లయ్య దగ్గిర ఒక పిల్లవుంది. చక్కని చుక్క! అయితేమటుకు ఎల్లయ్య దరిద్రదోషం వలన కొంత డబ్బు కోరుతున్నాడట. పాపం అతగాడు పశువుల వ్యాపారంలో దెబ్బతిన్నాడు కదూ!"

ఇల్లు నిర్మించి పెట్టడంలోను ఇల్లాల్ని ఏర్పర్చి పెట్టడంలోను వెంకోజి మహా నేర్పరి. పదిహేను

రోజులు అదేపనిగా పెట్టుకుని ఎల్లయ్య ఇంటి చుట్టూ తిరిగి ఎవరికి చెప్పేమాటలు వారికిచెప్పి ఇరువురి చేతా ఒప్పించాడు. మొదటయితే వీరాస్వామి కొంచెం అయిష్టత కనపర్చాడు కాని వధువును చూచిన తదుపరి ఎల్లయ్య అడిగిన రెండువేల రూపాయ లివ్వడానికి ఏమాత్రం వెనుకాడలేదు. ఆ జవ్వని తన నట్టింట్లో నిలబడితే చాలుననుకున్నాడు వీరాస్వామి. ఆ తరుణి ఒక విద్యుల్లతా విగ్రహం. అనాదరణచే ఆ సౌందర్యశోభ ధూళి పట్టివున్నది. సాటిలేని విలువగల అమృత భాండం తనది కాబోతున్నదనే వుత్సాహంతో మరొక రెండువేలు ఖర్చుపెట్టి ఆభరణాలు ఏర్పర్చి ఒకవెయ్యిరూపాయలు వివాహ కార్యక్రమములకు వెచ్చించాడు.

మంచిరోజు చూసుకుని నూత్న వధువుకు సర్వలాంఛనాలూ జరిపి తన ఇంటికి తెచ్చుకున్నాడు. ఆరోజు సాయంకాలమున వీరాస్వామి కనకాన్ని తన ముందు కూర్చోబెట్టుకుని తన ఆచార వ్యవహారములను గురించీ, తన అలవాట్లను గూర్చీ వాటి కనుగుణంగా ఆమె నడుచుకోవల్సిన పద్ధతుల్ని గూర్చీ సవివరంగా బోధించాడు. చివరకు వీరాస్వామి 'ఏమంటావ్, చెప్పాను కదా?' అన్నాడు కనకం ముసిముసి నవ్వుల్తో తన అంగీకారాన్ని తలవూపుతూ తెలియ జేసింది. ఒక ఘనకార్యం సాధించినంత గొప్పగా సంతృప్తి చెందాడు. ఆ మధురక్షణాన అతని మనసు ఒక దివ్యానుభూతిని పొందింది. తన జీవితపు పోకడలకు తగినట్లుగా ఆ లేత గుండెల్లో మార్పు తేగలిగానని ఒక విధమైన చల్లదనము, ఆనంద పారవశ్యత, పొందాడు. ఇంతకాలంనుంచీ అతని మనసు నావరించియున్న కొన్ని విశ్వాసములలో బిగువు సడలింది. మూసుకుని వున్న అతని హృదయ కుహరమును కనకంయొక్క లావణ్యశోభ నెమ్మదిగా తెరిచింది. ఆమె అరమోడ్పు కనులనుండి సుకుమారంగా ఒలికి పడుతూండే శృంగార దృష్టులు ఉద్రేకం చల్లారిన అతని గుండెల్ని చక్కిలిగింతలు పెడుతున్నయ్. ఆ నడకలోని ఒయ్యారము, ఆకర్షణ యంత్రాలనదగిన ఆ గులాబీ చెక్కిళ్ళు, గుండెల్ని వూపే ఆ కిలకిల నవ్వులకు అతనిలో నిద్రాణమైయున్న కొన్ని శక్తులు చైతన్యంపొంది విజృంభింప మొదలిడినాయి. విరక్తిభావాలన్నీ తుడుచుకుని పోగా అతని హృదంతరమున అనురాగోదయమైంది. వాడిపోయిన జీవితపు ఆశలు చిగిర్చి కొంచెంగా పుంజుకుంటున్నాయి. యౌవనపరిమళం గుబాళించే ఆమె కౌగిలిలో మహత్తర ఆనందానుభవమును పొందగలుగుతున్నాడు వీరాస్వామి. ఆ వలపు తీపి అతనికి తన వయసునుకూడా జ్ఞాపకంలేకుండా చేస్తోంది. ఆ నవ వికసిత పుష్పమును తన చేతిలో బంధించుకుని తన కనువైనరీతిగా వుపయోగించుకోగలననే ధైర్యం, అహం అతనిలో వుదయించినయ్. మూడుమాసాలు గడిచిన తదుపరి ఒకనాటిరాత్రి భోజనసమయాన విస్తర్లో తన కయిష్టమైన కొన్ని పదార్థములు వడ్డించి వుండటం చూసి తన బోధలు కనకంలో ఏమంత చురుగ్గా పనిచేయడంలేదని గ్రహించి వీరాస్వామి వెంటనే కొంచెం మందలింపు ధోరణిలో గద్దింపుగా అడిగాడు. "ఇంతకాలంనుంచీ నేను నా అలవాట్లనుగూర్చి నీకు చెప్తూవచ్చిన విషయం ఏమిటి? నీవు యిపుడు చేసినపని ఏమిటి? నేను ఖచ్చితమైన శాకాహారినని నీకు తెల్సునుకదా!" ఏమాత్రం వ్యవధిలేకుండా సురసురలాడుతూ కొంచెం పెళుసుగా జవాబిచ్చింది కనకం "ఒకరికోసం నా నాలుకమీద వాతపెట్టుకోటం నాకు చేతకాదు. అన్నిపనులూ డబ్బువలనే సాధించవచ్చునను నమ్మకతో వుండి ప్రయోజనంలేదు." యీమాటల్తో చెంపలు రెండూ వాయించినట్లయింది. అతని అహం బాగా దెబ్బతిన్నది. ఆ చివరివాక్యం అతనిమనసుపై ఆగ్నేయాస్త్రంలాగా పనిచేసి ఎంతోసేపు ఆ వేదన్తో అలమటింప చేసింది. అయినప్పటికీ ధైర్యం కోల్పోడానికి ఇష్టపడక "నీమాటలు నాకేమీ అర్థం కావటంలేదు" అన్నాడు. "అటీకా తాత్పర్యాలు చెప్పేందుకు నాకిపుడు తీరికలేదు." అని జవాబిచ్చింది కనకం నుదురు చిట్లిస్తూ.

ఈమాటలు మనసును నీరసపరుస్తున్నప్పటికీ 'పరిస్థితి మించిపోయిందేమీ లేదు. అదుపులోకి తేవచ్చు' అని అతనిలోని అహం అని అంటూ కొంచెం నిబ్బరాన్ని కలిగిస్తోంది వీరాస్వామి యిక మరి ఎదురు మాట్లాడకుండా ఒకనిమిషకాలంపాటు దీర్ఘంగా ఆలోచించి చెమ్మగిల్లిన నేత్రాలతో పని ముగించుకు విస్తరి ముందునుంచి లేచాడు.

భోజనానంతరం రోజూ మాదిరిగానే వీరాస్వామి వసారాలోకివచ్చి కూర్చున్నాడు. తదుపరి కనకంకూడా తనభోజనం పూర్తి చేసుకుని చక్కగా శృంగారించుకుని పరిసరాల్ని సెంటు సువాస

నట్లో నింపుతూ ఒయ్యారంగా వచ్చి అతనికి తమలపాకులు యీనెలుతీసి యివ్వటం అలవాటు. కాని ఆరాత్రి వీరాస్వామి ఎంతసేపు వేచివున్నా అదేమీ జరుగలేదు. కొంతసేపటికి గదితలుపులుకూడా మూతపడ్డ శబ్దం వినిపించింది. వీరాస్వామి లేచివెళ్ళి వంటఇంట్లో చూచుసరికి ఎక్కడి దక్కడ అంతా సర్దివున్నది. గదిదగ్గఱకువచ్చి ఎంతోసేపు 'కనకం, కనకం' అని పిలిచాడు. జవాబులేదు. పిలవగా పిలవగా కొంతసేపటికి ఎక్కిఎక్కి ఏడుస్తున్నట్లు ధ్వని కొంచెంగా వినిపించింది. 'నిన్ను నేను ఏమన్నానుకనకం? యీ కాస్త మాత్రానికేనా?' అనిఅన్నాడువీరాస్వామిఅనునయంగా. ఇంకా ఎన్నో విధాలుగా బ్రతిమాలుతూ మాట్లాడాడు. కనకంనుంచి జవాబూ లేదు. కవాటములు తెరువబడనూ లేదు. చివరకు విసుగెత్తి వీరాస్వామి వసారాలో నేలమీదనే వాలి నిద్రపోయాడు.

ఆ మర్నాటి ఉదయానే వీరాస్వామి ఎల్లయ్యను పిలిపించి కనకం ముందు నిలబెట్టి గతరాత్రి వుదంతమంతా చెప్పాడు. ఆయన వీరస్వామి చెప్పిన విషయమంతా విని చివరకు కోపంతో మండిపడిపోతూ 'అపుడే అల్లరికి మొదలా? చాల్లే వూరుకోవయ్యా. నా పిల్ల యీ పెళ్ళివద్దని ఎంత గోలపెట్టినా వినక దాన్ని ఎంతో కష్టం పైన సమాధాన పర్చి యీ సంబంధం చేస్తే దాని బ్రతుకు బజార్లో పెట్టడానికి ప్రయత్నిస్తున్నావా? నువ్వు ఆసలు మాకు ఏ విషయంలో సాటి? వంశ మర్యాదలోనా? గొప్పతనంలోనా? నా ప్రారబ్దం యిలావుండి నేను పడిపోబట్టిగాని, లేకపోతే జమిందార్లింటికి వెళ్ళాల్సిన పిల్ల కాదటయ్యా? చుక్కలాంటి పిల్లను తీసుకెళ్ళి ముసలి పీనుక్కిచ్చి కట్టావని వూళ్ళోవాళ్లు నన్ను ఎంత నిందిస్తున్నారో తెల్సునా? జాగ్రత్త! మర్యాదగా నడుచుకో..." అని అంటూ నాలుగుకేకలు పెట్టి వెళ్ళిపోయాడు.

దీంతో వీరాస్వామి కుప్పకూలినట్లు కూలిపోయాడు. రాత్రి కనకం మాటలు చెంపదెబ్బలు. ఇపుడు ఎల్లయ్యమాటలు కాలితన్నులు. దిగులుగా ఎదుటినైపు చూస్తూ కూర్చున్నాడు. అతని నేత్రముల్లో అశ్రువులూరినై. నడకలో విజయగర్వం చూపిస్తూ కనకం లోపలి కెళ్లిపోయింది. తాను ఒక అంధకూపంలో పడిపోడానికి యీ తతంగం ఒక నాందీవాక్యంగా తోచిందతనికి. ఇకముందునుంచీ ఇతరుల ఆజ్ఞానుసారంగా పనిచేయు యాంత్రిక సాధనములవలె జీవితమును గడుపుటే మంచిదనీ, లేక చైతన్యముగల మానవునిగా స్వాభిప్రాయముల్లో, ఆదర్శముల్లో జీవింపదల్చుకుంటే తనకు మర్యాద దక్కదనీ తలచి ఆ పద్ధతినే అవలంభింప తన మనసులో ఆక్షణాన్నే శపథం చేసుకొన్నాడు వీరాస్వామి. ఆ నెలాఖర్న కసాయివానికి నలభైరూపాయల బిల్లు చెల్లించవల్సివచ్చినప్పుడు యాంత్రిక వీరాస్వామిలో అణిచిపెట్టుకున్న మానవత్వం కొంచెంగా తలయెత్తి చూసింది. కాని వెంటనే కనకం కల్పించుకుని 'సంసారమంటూ ఏర్పర్చుకున్న తర్వాత ఖర్చుగాక ఏమవుతుంది' అంటూ కొఱకొఱ చూడటంతో శపథం మాట జ్ఞప్తికివచ్చి మారుమాటాడకుండా పర్సుతీసి నాలుగు పదిరూపాయల కాగితాలూ వాని చేతిలో వుంచాడు.

వీరాస్వామి ఎంతకాలం ఓపికపట్టి చూసినా పరిస్థితుల్లో ఏమాత్రం మంచి మార్పు కనిపించటం లేదు. రోజులు వారాలు మాసాలు గడిచినకొద్దీ అతను యీ యాంత్రికస్వభావాన్ని భరించలేకపోతున్నాడు. అతనిలోని మానవత్వం పౌరుషహీనమై పడివుండటానికి ఒప్పుకోటంలేదు. మనసుని ఎంత రాయి చేసుకుని మూగగా కాలం గడుపుతూన్నప్పటికీ కళ్ళముందు జరిగే ఒక్కొక్క అకార్యము, కర్ణముల్లోకి బలవంతంగా దూరివస్తూన్న ఒక్కొక్క కఠోర వాక్యము అతని మనసుని రాచి రంపాన పెడుతున్నాయి. కర్తవ్యం కానలేక నిస్సహాయతతో అతనిలోని పరిశుద్ధహృదయం దీనాతిదీనంగా విలపిస్తోంది. రాత్రిసమయాలందు అతనిపట్ల నిద్రాదేవి ఘోరంగా కాఠిన్యం వహిస్తోంది పక్కమీద కూర్చుని గంటల కొలదీ, కన్నీటిబాష్పాలతో భూదేవిని అభిషేకించటం అలవాటైపోయింది. అంధతమస్సులకుకూడా గుండెలు కరిగి వేగంగా వెనక్కు జరిగిపోతున్నాయి.

అలవర్చుకుందామనుకున్న యాంత్రికపద్ధతి అతనికి అనుకూలంగాక చాలా తరుచుగా తన విధి నిర్వహణలో దెబ్బతింటూన్నది. భగవంతునిపై భారం వుంచి శపథాల్లో అణగగొట్టి నిరాయుధగా కూర్చోపెడదామనుకున్న అతనిలోని 'మానవత్వం' ముందు అతని మనఃశక్తి పనికిమాలినదై పోతూన్నది.

భూతకాలపు శాశ్వత గౌరవ పౌరుషాలు వెనుకనుంచి పొంచిచూస్తూ ఎత్తిపొడుపు మాటలు విసుర్తూ అతని గుండెల్లోని వివరాల్ని నులిమివేస్తున్నాయ్. జీవశక్తి కలిగివుండుటయే మానవుని ప్రత్యేకత అని వీరాస్వామి తెలుసుకోలేదు తన జీవితంలో ప్రవేశపెట్టుకున్న యాంత్రిక విధానం నిష్ఫలమైపోవడానికి అదే కారణమనే మాట అతని మనసుకు తట్టలేదు. తన జీవితంలో ఆశాసౌధములన్నీ కూలిపోయి పరిసరములు హేయభాజనములుగ పరిణమించి, ఆహార పానీయాదులు విషప్రాయములై, భవిష్యత్తు భయదాంధకారముగతోచి, హృదయం దుర్బలమైపోయి, యీ విశాల ప్రపంచంలో ఆదరణ చూపే అమృత హస్తం లభింపక, సూర్యచంద్రులు సైతము విషాద జీమూతములై హింస పెడుతూన్నప్పుడు మానవునిలోని 'మానవత్వం' అతిణ్ణి ఆత్మహత్యకైనా పురికొల్పవచ్చు. లేక లోకం యొక్క సానుభూతి కొంతవరకూ కలిగివుండి, హృదయబలం కోల్పోక, కనీసం సానునయ వాక్యాలయినా లభించి గుండెల్ని తడిచేయగల్గినపుడు విప్లవభావములు రేకెత్తించి రణరంగ ప్రవేశమునకైనా ప్రోత్సాహించవచ్చు. మరోక రకమయిన మానవులుకూడా వుంటారు. వారిలో శక్తి హీనమై బూజుపట్టి వున్న మానవత్వం వారి హృదయాల్ని నిరంతరం దుఃఖాగ్నిలో భస్మీపటలం గావిస్తూ, జీవచ్ఛవాలలాగా జీవించేవున్నావనిపిస్తూ ఏ నిమిషానికా నిమిషం మనసుని వాడికత్తితో గాట్లు పెడుతూ క్రమక్రమంగా కాష్ఠభూమికి సమీపంగా లాగుతూ వుంటుంది.

ఒకనాటి సాయంకాల సమయాన వెంకోజి పురాణ శ్రవణానంతరం వీధిగుమ్మంలో నుంచే వాగుడు మొదలెడుతూ లోపలకు వచ్చాడు. "అమెరికావాడు కూడా మాయచంద్రుణ్ని చేసి ఆకాశంలోనికి విడిచాడుట వీరయ్యా. వాడెంత మొనగాడయ్యా, నాకు ఇప్పటివరకు తెలీదుసుమీ. ఇందాక ఏదో సందర్భం వచ్చి ఇట్లా జరిగింది వెంకోజీ అని చెప్పారు మా పురాణం శాస్త్రులుగారు..."

వీరయ్య కొంచెం కోపోద్రేకంతో అన్నాడు: "నీవేనా మొనగాడివి కానిది! నీవూ చేసి చూపించావుగా నాకు ఒక పెళ్లి! మూలనున్న వాడ్ని ముంగిలికి నెట్టి అవస్థల పాల్జేశావ్."

"అదేమిటి అట్లాగంటావ్ వీరయ్యా? ప్రతి మానవుడు ఇల్లూ ఇల్లాలూ కలిగివుండాలి. ఇది మానవుని ప్రాథమిక హక్కులు" చేతులు రెండూ వెనక్కు మెలి పెట్టుకుని పచార్లుచేస్తూన్న వీరాస్వామి వెంటనే ఆగి కొంచెం వెటకారంగా ఇలా అన్నాడు— "అవునవును. నువ్వు కట్టిపెట్టే ఇళ్లుకూడా ఇలానే వుంటాయా?" వెంకోజీ పీలదేహం పౌరుషం తోటి వూగిపోతూండగా ఇలా అన్నాడు—"నేను తయారుచేసిన ఇళ్లా? ఎంత పునాదిబలం ఏర్పాటు చేస్తానో తెల్సునా? నా చేతిమీద నడచిన గృహనిర్మాణాలను కంః బట్టే వాస్తుసిద్ధాంతి ఇంతవరకూ పుట్టలేదనుకో. కావాల్సివుంటే వెళ్లిచూడు. గుంటూరులో జిల్లాకోర్టు భవనం, తెనాలి తాలూకా హైస్కూల్లోని పెంకుటేవసారా, కొల్లూరులోని పూర్ణయ్యగారి అన్నదాన సత్రం, ఈవూళ్లో పుగాకు డబ్బుతో లేచిన మేడలూ—వీటన్నిటికి మేస్త్రీని నే నేనయ్యా. ఆ కాలాన పంచపాండవుల ఆస్థాన మయుడు వాస్తు సలహాదారుడు - యీ కాలాన పాండవుల సుగుణాలన్నీ పొదిగివున్న మా పురాణం శాస్త్రులవారికి నేను వాస్తుసిద్ధాంతిని." వీరాస్వామి ఏదో జవాబివ్వపోతూండగా లోపల్నుంచి సన్నని కంఠస్వరం పలికింది "అన్నీ మంటపెటావులే. వారికీ వీరికీ పాచిపన్లతోసహా సేవచేసి ఫించనుపుచ్చుకున్న ఆ పాన, వృత్తినుండి విరమించి డాబుల డప్పు వాయించుకుంటూ కూచున్న నువ్వూ మీ యిద్దరూ కలిసి వాగొంకుకోశారు."—వెంకోజీ ఖిన్నుడై మారుమాటాడకుండా బయటికొచ్చి తన వెంటవున్న వీరాస్వామితో 'ఏమిటి వీరయ్యా యీ విపరీతం!' అని అన్నాడు ఆశ్చర్యంగా.

"నీవు తెచ్చి పెట్టిందే" అని చీత్కారంగా జవాబు. వెంకోజి వెంటనే పకపకా నవ్వుతూ" ఇది దాంపత్యం వీరయ్యా దాంపత్యం. ఇది ఒకప్పుడు ముంటివాడి మరోకప్పుడు సుమశయ్య. ఇది నీకేమిటి? శ్రీకృష్ణపరమాత్ముడంతటివాడికి ముక్కుతిమ్మన్నగారు ఎంత గయ్యాళి భార్యను ఏర్పాటుచేశాడో తెల్సునా? దేవతలే పరమపూజనీయంగా భావించే ఆయన శిరసును కాలితో తన్ని మరీ కసితీర్చుకుంది సత్యభామ......" వెంకోజి మాటలకు అడ్డుతగిలి వీరాస్వామి గద్గద కంఠస్వరంతో ఇలా అన్నాడు. "నేను వచ్చి వచ్చి పెద్ద ఊబిలో పడ్డాను మామా. ఏ దృష్టిలో చూసినా ఇది పెద్ద మడుగే. ఆవిడ

పోకులే కెలకు యాభై రూపాయలు మింగేస్తున్నయ్. సబ్బుబిళ్ళలకు సెంటుసీసాలకు అందులో ఇరవై రూపాయలు ఖర్చయ్యా."

వెంటనే వెంకోజీ నోరుతెరిచి బిగ్గరగా అన్నాడు. "సున్నిపిండి వాడమనవయ్యా. మితి వ్యయమే క్షేమకరమని బోధించు. మడుగు అంటా వేమిటి వీరయ్యా? కొంతకాలం ఓపికగా కాలం గడిపావంటే ఒక నందనవనమే కాగలదని నమ్ము. నా ఆశీర్వచనం ఇంతమటుకు ఎక్కడా వ్యర్థమైంది లేదు. నువ్వు ఎంత పుణ్యపురుషుడవోయ్ వెంకోజీ అని అంటూ వుంటారుకూడాను మా పురాణం శాస్త్రుర్లు గారు. కనుక సంవత్సరం తిరిగేసరికి నీకు పుత్రరత్నం కలిగి తీరాలని నేను ఆశీర్వదిస్తున్నాను. తప్పకుండా కలిగితీరవల్సిందే. ఇక పో వీరయ్యా." అని అంటూ చెప్పి వెంకోజీ నెమ్మదిగా బయల్దేరాడు.

తాను వీథిలో నడిచిపోతూన్నపుడు అరుగులపైని అమ్మలక్కల గుసగుసలు, స్కూలు పిల్లల చిలిపి నవ్వులు, అడుక్కునే వాళ్లదగ్గరనుంచీకూడా కనపరుస్తూన్న నిర్లక్ష్యదృష్టి—వీటన్నిటనీ వీరాస్వామి జాగ్రత్తగానే గమనిస్తున్నాడు. మన సంతా ఎప్పుడూ గుబులుగా వుంటుంది. కనకం ఎంతో అవసరంపడితే తప్ప అతనితో మాట్లాడటంకూడా మానేసింది. రెండు పూట్లా విస్తర్లో వడ్డించిన ఆ కాసిని మెతుకులూ నోట్లో వేసుకుని వచ్చి వసారాలో ఖిన్నుడై కూర్చుంటాడు. కనకం సర్వాలంకార భూషితయై, కృష్ణ త్రాచులాటి పొడుగాటి నల్లని జడ గుండెలపై త్రిప్పి వేసుకుంటూ నీటుగా ఎక్కడికెక్కడికో తిరిగివచ్చేది. ఎవరెవరో వచ్చి తన మాటాపలుకూ లేకుండానే సరాసరి లోపలకువెళ్లి ఆమెతో మాట్లాడి పోతూండేవారు. తానొక గృహయజమాని అనే విలువ లేకపోగా అల్పజాతికి చెందిన పురుగుకంటె హీనంగా ఎంచబడుతున్నాడు. కండ్లలోనీరు కండ్లలోనే ఇంకింప జేసుకోటం ఆపని ఎన్నడైనా సాధ్యంకానపుడు ఎక్కడికైనా ఒంటరిగా వెళ్లి గుండెలభారం తీరేలాగు విలపించి రావటం జరుగుతోంది. రాత్రి ఎనమిదిగంటలకే కనకం లోపల గడియలు బిగించుకొని గదిలో పడుకుంటుంది. ఇక వీరాస్వామి అవసారాలో నేలమీదనే నిద్రపట్టక చాలా ప్రొద్దుపోయేవరకూ అటూ ఇటూ పొర్లి దుర్భరమైన మానసికయాతన పొంది పొంది చివరకు ఎపుడో కన్నుమూసేవాడు. ప్రస్తుతవిషాదవృత్తాంతాలతోపాటు గత జీవితంలోని సుఖమయానుభవాలు కూడా అతని మనసులోకి తొంగిచూస్తూ శరీరమంతా కంపరమెత్తిస్తూంటాయి. నీచదశ అనుభవిస్తూన్న కష్టకాలంలో గతించిన కాలం బాపతు స్వీయసుఖానుభూతులఛాయలు స్మృతిపథంపై తొణికిసలాడుటకంటె యమయాతన మరొకటి లేదు మానవుడికి.

వీరాస్వామి ఒకనాటిరాత్రి దేవాలయంలో హరికథ విని పొద్దుపోయి ఇంటికి వచ్చాడు. తన కొరకై వేచివుండే అవసారాలో నేలపై ఉస్సూరుమంటూ మేను వాల్చాడు. ఒక గంటకాలంపాటు కొంచెం విశ్రాంతిపొంది వచ్చిన అతని మనసును మరల విషాద మేఘములు క్రమ్మ ప్రారంభించినై. మనసును మూసేసుకు నిద్రాదేవి చేతుల్లోకి ఒరిగిద్దామని ఎంత ప్రయత్నిస్తున్నా దుఃఖమయ వృత్తాంతాలు బలవంతాన లోనికి తోసుకునివచ్చి పీఠం వేసుకుని కూర్చుని తల నరాలను నొక్కేస్తున్నాయి. ఇంతలో రెండు కంఠాలు చిన్నచిన్నగా నవ్వుతూ మాట్లాడుకుంటున్నట్లుగా వీరాస్వామికి వినిపించింది. వెంటనే వీరాస్వామి లేచి వెళ్ళి తలుపు కంతల్లోనుంచి చూచాడు. అతని శరీరంలోని నవనాడులూ క్రుంగిపోతూన్నాయి. శరీరం ఒక్కమాటుగా అమిత నీరసమైపోయి గజగజ ఒణికిపోతోంది. గుండెల్ని గట్టిగా అదుముకుంటూ తూలిపోతూన్న నడకతో వీధిలోకివచ్చాడు. ఇంతకాలము నుంచీ తనను వేధిస్తూన్న అనుమానములన్నీ పరమ సత్యస్వరూపములను ధరించి ప్రత్యక్ష నిదర్శనములుగా తనఎదుట నిలబడినయ్. ఇక ఏమాత్రం సందేహం లేదు. పట్టెమంచంపై కనకం ప్రక్కనకూర్చుని ఆమె గులాబీ చెక్కిళ్ళను అనురాగంగా నిమురుతున్నవాడు తప్పకుండా ఆ కిల్లీకొట్టు నారాయుడే! ఆ ఒంకులొంకుల క్రాఫింగుజుట్టు, ఆ కోలముఖము—వాడు తప్పకుండా నారాయుడే!

ఆ భయదాంధకార కాళరాత్రి సమయాన రోషం ఒకప్రక్కన దుఃఖం మరొకప్రక్కనా అతని మనసుపై సుత్తిదెబ్బలు కొడుతూండగా, గుండెలు తీవ్రా వేదన తాకిడికి పగిలిపోవుటకు సిద్ధమవుతూండగా వీరాస్వామి వీధివెంట నడిచిపోతున్నాడు. నడిచి వచ్చిన వెనుకదిక్కు అతని వీపుపై సూదికొకలు వేస్తూండగా, కండ్ల ముందు కన్పిస్తూన్న ముందుదిక్కు

అతని గుండెల్లోకి గుర్భరమైన శీతల కంపనాలను పంపిస్తోంది.

వీరాస్వామి కాళ్లు ఒక శిథిల దేవాలయంముందు ఆగిపోయినై. కొంచెం ఓపిక తెచ్చుకుని నెమ్మదిగా లోపలికి వెళ్ళాడు. దేవాలయ ప్రాంగణం శిథిలశిల్పాలతో నిండివుంది. ప్రభుత్వ భూగర్భశాఖవారిచే ఏర్పాటు చేయబడిన పెట్రోమేక్సు లైటుమాత్రం కాంతివంతంగా వెలుగుతోంది. ఒక మూలనపడివున్న మనోజ్ఞ శిల్పఖండం వేపుకు నడిచాడు. ప్రాచీన భారతీయ శిల్పకారుల కళానైపుణ్య విశేషం ఆ శిథిల శిల్పపు లోతుల్లో జిగితిగ్గి ప్రకాశిత మవుతోంది. ఒకపుడు ఏ దేవాలయపు శిఖరాలప్రక్కనో సుందరంగా నిలబడి అధిక పూజ్యతపొందిన ఆ శిల్ప ప్రతిమ నేడు మట్టిలో సగంవరకూ పాతుకుపోయి స్కూలు కుర్రాళ్ళు దానిపై కూర్చుని సిగిరెట్లు తాగేటందుకు వుపయోగ పడుతోంది. కళ్ళు తుడుచుకుని ఒక్కతడవ ఆ శిథిల శిల్పం వంక తేరి పాఱ చూశాడు వీరాస్వామి. తన జీవితానికి ఆ శిథిల శిల్పానికీ ఎంతో పోలిక వుందనుకున్నాడు. ఇరువురూ అనుభవించేదశలు ఒకే మాదిరివి! కాని దానికి హృదయం లేదు. తనకు హృదయంవున్నది. తనకుకూడా హృదయం లేకుండా పోతే యీ బాధలేదు.

వీరాస్వామి అక్కడనుండి లేచి వెంకోజిఇంటికి వెళ్ళి ఒకతూరి తలుపు చరిచాడు. జవాబు లేదు. వెంటనే వెనక్కి తిరిగాడు. ‘ఆయనమాత్రం ఏం చెప్తాడులే. భగవంతుడైన శ్రీకృష్ణుడే భార్యచేత కాలి తన్నులతిని కిక్కురుమనకుండా పడివున్నపుడు, మానవ మాత్రుడివి నీవు యీ పనికి ఎందుకు సహించలేవు అని అడుగుతాడు. అంతే’ అని మనసులో అనుకుంటూ ఇంటికి వచ్చాడు. నారాయుణ్ణి రెండునిమిషాలక్రితం పంపించి బయట నిలబడివున్నకనకం వీరాస్వామినిచూచి “రాత్రి రెండుగంటలవరకు యీ తిప్పట్లకు అంతులేకుండా వుండే.” అని అంది మూతి ముడుచుకుంటూ. అతని లోని ఆత్మశక్తి తగినజవాబు నే సిద్ధపర్చిందిగానివెంటనే యాంత్రిక స్వభావం అడ్డుపడి నోరు నొక్కేసింది. అనంత దుఃఖాల్నీ ఆవేదనల్నీ అత్యంత సహనంగా తనయందు ఇముడ్చుకోగల్గిన కాలచక్రపు గంభీర గమనంలో తొమ్మిదిమాసాలుగబగబా దొర్లిపోయినై. పచ్చి శృంగార రసానుభవం, నీచస్నేహం కనకానికి ఒక ఘోరమైన సుఖవ్యాధిని సంక్రమింపచేసినయ్. ఆమె పల్లవాధరములు తెల్లగా పాలిపోయి వికృత రూపాన్ని ధరించినై. ఆ నున్నని గులాబిచెక్కిళ్లు దళసరములై పగుళ్ళు చూపినయ్. వెన్నెలకాంతులు ప్రసరింపచేసే ఆ ముఖబింబం చిరుచీకట్లకాలవాలమై ఒక విషాద నిలయంగా మారిపోయింది. ఒంకులొంకులుగా తిరిగివున్న ఆ నీలకేశములు ధవళవర్ణమునకు తిరిగి ఒక్కటొక్కటే రాలిపోతున్నయ్. తప్తకాంచనమును ధిక్కరించు ఆమె దేహమునకు నల్లని కప్పు పట్టింది. ఈ తీరుగా ఆమె మనోహరరూపవిలాస సంపదనంతనీ బొబ్బల వ్యాధి స్వేచ్ఛగా భక్షించి ఆమెను ఒక కురూపిగా, దూరాన్నుంచే చూచుటకు అసహ్య మొదవునట్లుగా తయారుచేసింది. తల్లితండ్రులు కూడా ఆమె ఇంటికి రావటం మానుకున్నారు.

యాంత్రిక స్వభావం వీరాస్వామిని మాత్రం అహంకారావేశాలకు జుగుప్సకు అతి దూరుడ్ని చేసి అతనిచే ఆ కుళ్ళిపోయిన రోగికి సమస్తోపచారములనూ నోరెత్తకుండా చేయిస్తోంది. డాక్టర్ వచ్చి రోగిని పరీక్షించి కనకం చరిత్ర తెలిసివుండే, చమత్కారంగా ప్రశ్నించాడు “యీ అమూల్యాభరణాన్ని ఎక్కణ్నుంచి సంపాదించుకున్నావమ్మా?”

ఆ ప్రక్కనే నిలబడివున్న వీరాస్వామి తోచుకోకుండా వెంటనే జవాబిచ్చాడు “నావద్దనుంచే”

డాక్టర్ కలవరపడుతూ అడిగాడు “అలాగా? ఇంకా మీరేదో పెద్దమనుష్యులనుకున్నాను.”

ఏమాత్రం తొణక్కుండా వీరాస్వామి చిరునవ్వులో ఇలా అన్నాడు “ఆఁ చేసింది ప్యూన్ వుద్యోగంకదండీ? పైగా మూడేళ్ళపాటు ఏకాంత జీవితం”

శక్తిహీనములై వాలిపోతూండిన ఆమె దీన దృక్కులు ఆ నిమిషాన అతి భక్తి శ్రద్ధల్తో వీరాస్వామి పాదములకు మ్రొక్కినయ్. డాక్టర్ ఇంజక్షన్ ఇచ్చి వెళ్ళిపోయాడు. కనకం వీరాస్వామిని పిలిచి మంచం మీద కూర్చోమని సైగచేసింది. వీరాస్వామి పక్కమీద కూర్చున్నాడు. అతని చేతుల్ని తన గుండెలకు అదుముకుని అతని నేత్రాల్లోకి ఏకాగ్రంగా చూస్తూ దీనంగా అడిగింది “నేను మీకు నిజంగా ఎట్లా కన్పిస్తున్నాను చెప్పండి. క్రూరరాక్షసిలాగా కదూ?...”

"కాదు, కనకంలాగానే..."

ఆమె నివ్వెఱపోయి అన్నది "కనకంలాగానే!........ యీ స్థితిలో నన్ను మీ కనకంలాగానే భావిస్తున్నారా మీరు? మానవుల్లో ఇంతటి క్షమాశక్తి వుండగలదని నే నెప్పుడూ తెల్సలేదు. దీని నే అసమర్థతగా భావించి మీకు దారుణద్రోహం చేశాను." ఆమె హృదయం శోకపరితప్తము కాగా కంట్లవెంట అశ్రువులు ప్రవహిస్తున్నాయి.

"ఎందుకలా విలపిస్తావ్?" అని జాలిగా అడిగాడు వీరాస్వామి. కనకం తన ముఖాన్ని తన ఒళ్ళో దాచుకని పొంగిపోతున్న దుఃఖభారంతో మాటలు నలిగి పోతూండగా ఇలా అన్నది "మీ పరిశుద్ధ హృదయానికి మహా అపకారం చేశాను. మీపట్ల నేను సల్పిన అపచారానికి తగిన శిక్ష యీ లోకంలోనే అనుభవిస్తున్నాను ఇక ఆ లోకపు శిక్ష ఎంత ఘోరంగా వుండగలదో తెలీదు." అతని గుండెలు ద్రవీభూతమైనవి. బుగ్గలపై కన్నీటిధారలు చారలు కడుతున్నాయి. సానునయంగా ఆమె శిరమును నిమురుతూ ఓదార్చాడు.

వీరాస్వామి సంపాదించిన పదివేల రూపాయలు గబగబా ఖర్చయిపోవటమూ, కనకం తుది తడవ క్షమా భిక్ష వేడి అతనినుండి యీ లోకమునుండి శెలవు పుచ్చుకోవటమూ ఒక్క తడవగా జరిగినై. ఆ పదిహేను రోజులూ ఎలాగో గడిపి అప్పుతెచ్చి ఆమె శ్రాద్ధకర్మలను పూర్తిచేశాడు.

కనకంతో బాటు యాంత్రిక స్వభావం కూడా అతనినుండి ఎగిరిపోయింది. వీరాస్వామి తిరిగి బస్తీ చేరుకుని ఒక బ్యాంకులో బిళ్ళజవాను నౌకరి సంపాదించాడు.

ఉదయం పదకొండు గంటల సమయం, బ్యాంకు సెక్రటరీగారి ఆఫీసురూమ్ ముఖద్వారం ముందు బిళ్ళబంట్రోతే వీరాస్వామి ఠీవిగా, దర్జాగా, ఉద్యోగపాయగా నిలబడివున్నాడు. అతడు పూర్వము మాదిరే తన జీవితవృత్తిలోని ఆనందం లవలేశము పొందాలని ప్రయత్నిస్తున్నాడేగాని కొద్దికాలం క్రితమే అతని బ్రతుకుబాటల్లో రగిలిన మంటలు అతని మనసులో ఆరిపోనే లేదు. మనసులోని మంటల బాపతు వేడి ముఖంలో కన్పించకుండా చేయాలని అతను ఎంతో ప్రయత్నిస్తున్నాడు కాని ఆ పని అతనికి సాధ్యం కావటం లేదు.

Statement about ownership and other Particulars about newspaper

BHARATI
Monthly

1. Place of Publication :
   6&7, Thambu Chetty St. Madras-1.
2. Periodicity of its publication :
   7 th of Every Month
3. Printer's Name :
   Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address: 6&7, Thambu Chetty Street, Madras-1.
4. Publisher's Name :
   Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address : (As above)
5. Editor's Name;
   Sri S. Sambhu Prasad
   Nationality Indian
   Address: 29, Chamier's Road, Adyar, Madras 20.
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one per cent of the total capital.

NAME	ADDRESSES
1. Mr. S. Sambhu Prasad	29, Chamier's Road, Adyar, Madras-20.
2. Mrs. S. Kamakshamma	Do
3. Mr. S. Nageswara Rao	Do
4. Mr. S. Radhakrishna	6 & 7, Thambu Chetty Street, Madras-1.

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief

(*Sd*) S. RADHAKRISHNA,
28-2-1958. Signature of Publisher.